# భీషణ ప్రతీకారం

## 1

భీమసేనుడధర్మ యుద్ధం చేసి దుర్యోధన చక్రవర్తిని నేలకూల్చి వేసిన విషయం స్మరించినకొద్దీ అశ్వత్థామ హృదయం దారుణక్రోధ జ్వాలలతో దహించుకుపోయింది. 'తన అప్రతిహతశాసనంతో ఆర్యావర్త రాజన్యులందరికీ రారాజై వెలిగిన దుర్యోధన చక్రవర్తి నిస్సహాయుడై కేవలం ఏకాకిగా యుద్ధభూమిలో ధూళిలో పడి పొరలాడుతున్నాడు! ఎంతటి దుర్దైవ దుర్విపాకం సంభవించింది!' అని అశ్వత్థామ ఆ చక్రవర్తి దురదృష్టం తలుచుకొని తోక తొక్కిన తాచులా కస్సుమని బుసకొట్టి నాలుగు వైపులా పరకాయించి చూచాడు.

అంతటా గాఢాంధకారం! కురుక్షేత్ర రణరంగంలో క్షతగాత్రుల హాహాకారాలు భీకర జంబుకాక్రందనాలతో కలిసి మిన్నందుకొంటున్నాయి. కన్ను పొడుచుకొన్నా చూపులానని ఆ భయంకర నిశీథంలో అతని కొక వటవృక్షం మీద రెండు పెద్ద పెద్ద మిడుగురు పురుగులు కనిపించాయి. అశ్వత్థామ పరిశీలనగా వాటివైపు చూచాడు.

అవి మిణుగురులు కావు! భయంకరమైన గుడ్లగూబ మిడిగుడ్లు. ఆ గుడ్లగూబ మర్రిచెట్టు కొమ్మలమీద సుఖంగా నిద్రపోతున్న కాకుల నన్నిటినీ ఒకటొకటిగా సంహరించి వేస్తూంది. ఆ భీషణ ప్రతీకారం చూడగానే అశ్వత్థామ హృదయంలో అన్యాయంగా భీష్మద్రోణకర్ణాది కౌరవు

లను సంహరించిన పాండవులందరిని నిశ్శేషంగా చంపివెయ్యాలని ఒక భీకర సంకల్పం బయలుదేరింది. వెంటనే తన పార్శ్వంలో నిలబడిన కృపాచార్య కృతవర్మ లిద్దరికీ ఆ సంకల్పం తెలియజేశాడు.

"ఎంతటి బద్ధశత్రువులనైనా నిద్రలో మైమరచి ఉన్నవారిని సంహరించడం క్షాత్రధర్మం కా"దని కృపాచార్యు డతని కనేక విధాల చెప్పి చూచాడు.

అశ్వత్థామ నేత్రా లా అంధకారంలో చింత నిప్పుల్లా మెరిశాయి:

"గురువరేణ్యుడనే గౌరవమైనా లేకుండా అస్త్రసన్యాసం చేసిన నా తండ్రిని ధృష్టద్యుమ్ను డావిధంగా తల నరికివెయ్యడం న్యాయమేనా? శిఖండి నెదట పెట్టుకొని అర్జునుడు భీష్మాచార్యుని ఆ విధంగా ఓడించి వెయ్యడం ధర్మసమ్మతమేనా? పాండవు లెవరితో ధర్మయుద్ధం చేశారు? వారు చేసినవన్నీ అధర్మ యుద్ధాలే! నే నీ రాత్రితో పాండవుల శిబిరం అంతా పీనుగుపెంటలతో నింపి వేస్తాను! ఆ శుభవార్త రణరంగ ధూళిలో పొరలాడుతున్న దుర్యోధన చక్రవర్తి కెరిగించి నా ప్రభుఋణం తీర్చు కుంటాను. దీనికి నీవిక మారుచెప్పవద్దు!"

కృపాచార్య కృతవర్మ లిద్దరూ అతని రోషావేశధాటికి తాళలేక నిరుత్తరులై నిలబడ్డారు. మారుమాటాడక ఆ గాఢాంధకారంలో అశ్వత్థామతో కలిసి పాండవ శిబిరంవైపు నడిచి వెళ్ళిపోయారు.

దుర్యోధనుడు తొడలు విరిగి నేలపై పడిపోగానే పాండవ శిబిరం లోని వారందరూ ఇక యుద్ధం సమాప్తమై పోయిందిగదా అని గుర్రుపట్టి హాయిగా గుండెలమీద చేతులు వేసుకొని నిద్రపోతున్నారు. ఎక్కడా అలికిడిలేదు. అశ్వత్థామ కృపాచార్య కృతవర్మలతో కలిసి పాండవ శిబిరం సమీపించాడు.

కృతవర్మ కృపాచార్యు లిద్దరూ ఆ అంధకారంలో పాండవసేనా నివేశానికి కొంచెం సమీపంలో నిలుచున్నారు.

దుర్యోధనుడు నేలమీద పడిపోయి అశక్తుడైనా, హతశేషమై

చెదరిపోయిన కౌరవసేనావాహిని కంతటికీ అశ్వత్థామనే సర్వసేనాధిపతిగా నియమించి స్వహస్తాలతో అతనికి సేనా పట్టాభిషేకం చేశాడు.

అశ్వత్థామ తండ్రిని చంపిన ధృష్టద్యుమ్నుని రక్తం కళ్ళారా చూచి మరీ నిద్ర పోవలెనని నిశ్చయించుకొన్నాడు. నెమ్మదిగా అడుగులు వేసు కుంటూ పాండవ శిబిరం లోపల ప్రవేశించాడు.

ఆ శిబిరంలో ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలైనవారంతా శయనించే విడుదులన్నీ అత డింతకుపూర్వమే చూచాయగా తెలుసుకొన్నాడు. మెల్లి మెల్లిగా స్కంధావారం సింహద్వారం దాటి లోపల అడుగుపెట్టాడు. అంతలోనే అతని కళ్ళ కెదురుగా అత్యంత భయంకరమైన మహాభూతం ఒకటి గోచరించింది.

## 2

ఆ భూతం ఎవరో అశ్వత్థామకు తెలియలేదు. అది ధరించిన పెద్ద శార్దూల చర్మం అంచుల నుండి రక్తధార లవిరతంగా ప్రవహిస్తున్నాయి. హారాలన్నీ నాగుబాముల్లా బుసకొట్టాయి. ఆ భూతం నోరు తెరిచినప్పుడు కోరల కాంతులు నిప్పులు చెరిగిపోశాయి.

అశ్వత్థామ కా భూతం ఆ విధంగా అక్కడ ప్రత్యక్షం కావడానికి హేతువేమో తెలియలేదు. క్రమక్రమంగా ఆ భయంకర ప్రాణి నోటి లోనించీ, నాసికాపుటాలనించీ భీషణాగ్ని జ్వాలలు లేచి నాలుగువైపులా వెలుగులు విరజిమ్మాయి.

అయినా అశ్వత్థామ చెక్కుచెదరకుండా దానిమీద పుంఖాను పుంఖాలుగా బాణపరంపరలు ప్రయోగించాడు. కాని ఎన్ని వాడి బాణాలు ప్రయోగించినా ఆ భూతం ఎక్కడా చెక్కుచెదరినట్లు కనబడలేదు.

అశ్వత్థామ ఒరలోని ఖడ్గం పైకిలాగి చేతికొద్దీ ఆ భూతంమీదికి విసిరివేశాడు. భూతానికి తాకిన ఆ ఖడ్గం వట్టి దూదిపింజలా నేలపై పడి పోయింది. అశ్వత్థామ అంతటితో నిరుత్సాహం చెందక తిరిగీ ఒక గద ఆ

భూతంమీదికి ప్రయోగించాడు. అది కూడా ఎందుకూ కొరగాకుండా నేల మీద పడిపోయింది.

ఆ విధంగా తాను ప్రయోగించిన ఆయుధాలన్నీ ఎందుకూ పనికి రాకుండా పోయేసరికి అశ్వత్థామ ధైర్యోత్సాహాలు సన్నగిల్లి పోయాయి. లోలోపల పశ్చాత్తాపం ప్రారంభమైంది.

"ధర్మమార్గం విడిచి ప్రవర్తించే వారిని అధర్మమే నెత్తి అణచి వేస్తుంది. గోబ్రాహ్మణులను, పసివారిని, మత్తులను, ప్రమత్తులను, నిద్ర పోయే వారిని సంహరించడం అధర్మమని ధర్మశాస్త్రవేత్త లాదేశించారు. నే నా ధర్మమార్గం ఉల్లంఘించి అధర్మమార్గంలో ప్రవేశించాను. కనక నే నా కిలాంటి ఉత్పాతాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ విషమసంధిలో నేనేమి చెయ్యగలను!"

అశ్వత్థామ ఇక ఏమి చెయ్యడానికీ పాలుపోక అలాగే దిగాలుపడి పోయాడు.

కొంతసేపటికి కతని కా ఆపద గడిచి బయటపడడాని కీశ్వరారాధన తప్ప మార్గాంతరం లేదని తోచింది. ఆత్మశరీరంతో ఆ దేవదేవునికి పూర్ణాహుతి సమర్పించి ఈశ్వరానుగ్రహం సంపాదింపవలె నని నిశ్చయించుకొన్నాడు. తా నా ఆపద గడిచి బయటపడితే ఈశ్వరుని కాత్మోపహారం సమర్పింపగలనని మొక్కుకొన్నాడు.

అంతలో అతని కెదురుగా ఒక బంగారువేదిక ప్రత్యక్షమైంది. అది ఒక హోమగుండం. దానినిండా అగ్నిజ్వాలలు ధగద్ధగాయమానంగా వెలిగిపోతూ కళ్ళకు మిరుమిట్లు కలిగించాయి.

ఆ వేదిక చుట్టూ అరణ్యమృగాల ముఖాలతో భయంకరులయిన ప్రమథగణా లసంఖ్యాకంగా ప్రత్యక్షమైనారు. వారందరూ భయంకరంగా సింహగర్జనలు చేస్తూ వికటాట్టహాసాలతో అశ్వత్థామ మీదిమీది కురికారు. అయినా అశ్వత్థామ చలించలేదు.

అతడు తన శస్త్రాస్త్రాలన్నీ ఆ హోమాగ్నిజ్వాల కాహుతి చేశాడు.

"నాకు శత్రువులనందరినీ నిశ్శేషంగా సంహరించే శక్తి కలుగుగాక!" అని కళ్లు మూసుకొని పరమేశ్వరుని ధ్యానిస్తూ ఆ అగ్నిజ్వాలలలో ఉరికి ఆత్మోపహారం సమర్పించాడు. అయినా శరీరం ఎక్కడా కసుగందలేదు. అతడు తామరపూల సెజ్జపై నిలబడినట్లే ఉన్నాడు. అంతలో పరమేశ్వరుడు ప్రత్యక్షమై అతని చేతి కొక ఖడ్గం అందించాడు:

"అశ్వత్థామా! శ్రీకృష్ణుడు నిత్యము నన్నారాధిస్తున్నాడు. అతడు నా కత్యంత ప్రీతిపాత్రుడు. అందుచేత అతనికి హితులైన పాండవులు కూడా నాకు సన్నిహితులే. వారి కేవిధమైన అపకారమూ కలగకుండా నిన్న నేకవిధాలుగా ప్రతిఘటించాను. నీ అస్త్రాలన్నీ ఎందుకూ కొరకాక పోవడానికి హేతువిదే!

"అయితే పాంచాలురలో కొందరి కీక్షణంతో కాలం తీరిపోయింది. నీవు నా అనుగ్రహం సంపాదించి ధన్యుడవైనావు. నీ అభీష్టం సిద్ధింపగలదు. ఈ ఖడ్గం నీకు సహాయకారి కాగలదు!"

అని మహేశ్వరుడక్కడే అదృశ్యుడై పోయాడు. కాని అశ్వత్థామకు తెలియకుండా అతని శరీరంలో ఆవేశించాడు.

వెనకనే నిలిచి ఉన్న కృపాచార్య కృతవర్మలిద్దరూ కొంతదూరం నించి అశ్వత్థామ మహాసాహసం తిలకించారు. దగ్గరికివెళ్ళి అతని ననేకవిధాల ప్రశంసించారు.

అశ్వత్థామ ఆ భూతంమీద ప్రయోగించిన ఆయుధాలు, హోమజ్వాలలో ఆహుతి చేసిన ఆయుధాలు అన్నీ తిరిగి అతని రథంమీద ప్రత్యక్షమైనాయి.అతడుఆయుధాలలో కొన్నింటిని మళ్ళీస్వీకరించాడు.కృపాచార్య కృతవర్మలిద్దరూ అతన్ని అనుసరించి వెళ్ళబోయారుగాని అశ్వత్థామ దాని కంగీకరించలేదు. వారినిద్దరినీ సేనానివేశ ద్వారంలోనే తనకు రక్షకులుగా ఉండవలసిందని ప్రార్థించాడు. వారిద్దరూ అతని ప్రార్థన ననుసరించి పాండవ సేనానివేశం ద్వారంలోనే నిలబడి పోయారు. గాఢాంధకారం ఇంకా నాలుగువైపులా బాగా దట్టంగా అలుముకుపోయింది.

# 3

అశ్వత్థామ నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ పాండవ శిబిర లోలోపలికి వెళ్ళిపోయాడు.

ఆ శిబిరంలోనివారంతా గాఢ నిద్రలో మునిగి నిశ్చేతనులై పడి ఉన్నారు. అశ్వత్థామ వారి ముఖాలన్నీ పరిశీలిస్తూ ఇంకా లోపలికి వెళ్ళి పోయాడు.

అలా జాగ్రత్తగా పరిశీలించిన కొంతసేపటి కతని కంటి కెదురుగా ధృష్టద్యుమ్నుడు కనిపించాడు.

అతడొక హంసతూలికాశయ్యపై పవ్వళించి హాయిగా నిద్రపోతున్నాడు. అతని శయ్యచుట్టూ దీపకాంతులలో తళతళలాడుతున్న తెరలు వేలాడుతున్నాయి.

ధృష్టద్యుమ్నుని సుషుప్త సుఖం చూడగానే అశ్వత్థామ హృదయంలో మళ్ళీ క్రోధాగ్ని జ్వాలలు చెలరేగాయి.

"కౌరవ పాండవు లందరికీ అస్త్రవిద్యాగురువైన నా తండ్రి నేను మరణించాననే దుఃఖంతో అస్త్ర సన్యాసం చేసిన అదను కనిపెట్టి ఈ ఈ దుర్మార్గు డాయన శిరస్సు ఖండించి వేశాడు. ఇలాంటి దురాత్ము డీనాడు హంసతూలికాతల్పంపై శయనించి విజయగర్వంతో సుఖంగా నిద్రపోతున్నాడే! కౌరవులందరు పరాజితులై పోయారని కులుకుతున్నాడు గాబోలును!" అని అశ్వత్థామ అనుకొన్నాడు. ధృష్టద్యుమ్నుని దుష్ట ముఖం మరి చూడలేక పోయాడు.

కాలికొద్దీ అతని నొక్క తాపు తన్నాడు. ఆ దెబ్బతో ధృష్టద్యుమ్న డదిరిపడి లేచి నాలుగు వైపులా చూచాడు. ఎదురుగా ద్రౌణి రౌద్రాకారం కనిపించింది.

అశ్వత్థామ వెంటనే అతని కేశపాశం చేతబట్టి నేలమీద కీడ్చి కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు చాపచుట్టగా నేలమీద పడిపోయాడు.

అశ్వత్థామ అతని గుండెల మీద బలంగా మోకాలానించి కూర్చున్నాడు. పిడికిలితో అతని ముఖం మీద ముష్టిఘాత వర్షం కురిపించాడు.ఆ ఆఘాతాలతో ధృష్టద్యుమ్నుని కొక్కుమారుగా బాగా మెలకువ రావడము, అంతలోనే స్పృహ తప్పిపోవడము కూడా జరిగిపోయాయి. తరవాత కొంత సేపటికి ధృష్టద్యుమ్ననికి కొంచెం తెలివి వచ్చింది.

అశ్వత్థామ దారుణాఘాతాలతో అతని శరీరంలో జవసత్వాలన్నీ ఉడిగిపోయాయి. అలాగే అలిసి సొలిసిపోయిన నేత్రాలతో వైరి వైపు చూచాడు.

అంతలో అశ్వత్థామ తన వింటినారి తీసి అతని కంఠాని కురి బిగించాడు. ధృష్టద్యుమ్నుని ఒక పశువును చంపివేసినట్టుగా చంపివేయ బోయాడు.

ధృష్టద్యుమ్ననికి కొంత సేపటివరకు ఎంత ప్రయత్నించినా నోట మాట పెగల్లేదు. కాని ఎలాగో అలాగ గొంతు సవరించుకున్నాడు:

"గురుపుత్రా! నీవు నన్నొక పశువును సంహారించిన ట్లెందుకు సంహారిస్తావు! నీ నిశిత ఖడ్గంతో నా శిరస్సు ఖండించివెయ్యి! ఆ విధంగా చేస్తే నాకు పుణ్యలోకాలకు పోయే భాగ్యం కలుగుతుంది! నా తుది ప్రార్థన తోసివెయ్యకు!" అని డగ్గుత్తికతో ఎంతో దీనంగా బతిమాలుకొన్నాడు.

అలా డగ్గుత్తికతో అతిదీనంగా ప్రార్థించినా అశ్వత్థామ హృదయం కరగలేదు:

"ద్రోహీ! అంతటి గురుద్రోహం చేసినవానికి పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందనుకున్నావా? నీవెంతో నీచంగా నీ గురువును సంహారించి వేశావు! కనక నీవూ నీచమరణం పొందవలసిందే!"

అని చెప్పి వింటిత్రా డతని కంఠం తెగిపోయేటట్టు గట్టిగా బిగించి మోకాలిపోటులతోను, పిడికిలిపోటులతోను అతని శరీరం అంతా ఒక మాంసపుముద్దగా మార్చివేశాడు.

వెంటనే స్కంధావారంనించి తిరిగి వచ్చాడు.తనరథం ఎక్కి వింటి నారి తిరిగి వింట సంధించాడు.

అంతలోనే ధృష్టద్యుమ్నుని సేనాగారంలోని వారంతా ఆ సందడి విని మేల్కొని హాహాకారాలు చేస్తూ అటు ఇటు పారిపోయారు. దూరం దూరంగా వెళ్ళిపోతున్న అశ్వత్థామను ఎవడో క్రూరరాక్షసుడై ఉండ వచ్చునని ఊహించి వెంటనే అతని వెంటబడ్డారు.

అశ్వత్థామ అలాగే శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు మొద లైన ద్రుపదకుమారులనందరిని సంహరించివేశాడు.

అయినా అతని భీషణ ప్రతీకారదాహం సమసిపోలేదు. అక్కడ కట్టిన వందలకొలది గుర్రాలను, ఏనుగులను నిశ్శేషంగా నిర్మూలించి వేశాడు.

ద్రౌపదీ కుమారుల విడిదిలో ప్రవేశించి కుమారుల నయిదుగురిని గాఢనిద్రలోనే కత్తులు నరికి చంపివేశాడు.

అత డెంత వెదికినా పంచపాండవులు, కృష్ణుడు, ద్రౌపది మొద లయిన ముఖ్యులు కొంతమంది కనిపించలేదు.

అతని క్రౌర్యం చవిచూచిన పాండవ స్కంధావారంలోని సైనికు లంతా కట్టకట్టుకొని అతనిమీద విరుచుకుపడ్డారు. కాని అశ్వత్థామ వారి నందరినీ తన బాణాగ్నిజ్వాలల్లో భస్మంచేసివేశాడు.

వారందరూ అతని తీవ్ర బాణధాటి కోర్వలేక పాండవ స్కంధా వారాని కనతిదూరంలో నిలబడిన కృతవర్మ కృపాచార్యులకు శరణాగతు లయినారు.

అయినా ఆ ఇద్దరికీకూడా ఆ దౌర్భాగ్యులపై దయకలగలేదు. హత శేషులై మిగిలిన వారినందరిని కృపాచార్య కృతవర్మలిద్దరూ ఒక్కరు మిగల కుండా నిశ్శేషంగా సంహరించివేశారు.

## 4

ఆ అర్ధరాత్రి సమయంలో దుర్యోధనుడలాగే ఏకాకిగా పడిఉండి అసహ్యవేదనతో అటు ఇటు పొరలాడుతున్నాడు.

అశ్వత్థామ కృతవర్మ కృపాచార్యులతనిని సమీపించి సగౌరవంగా పార్శ్వంలో కూర్చున్నారు.

దుర్యోధన చక్రవర్తి దుర్దశ చూడగానే ఆ ముగ్గురి హృదయాలూ శోకభారంతో కుంగిపోయాయి.

అశ్వత్థామహృదయం వ్రీలి వ్రయ్యలై పోయింది:

"మహాప్రభూ! అనేక విధాలుగా నన్ను పోషించిన నీ వీవిధంగా దుర్దశపాలై ధూళిలో పొరలాడుతూంటే నేనింకా జీవించి ఉన్నాను! నేను నీకొక సేవకుడనేనా!

"నీవు రణరంగంలో మరణించి వీరస్వర్గం చేపట్టబోతున్నావు. నేనంతటి పుణ్యానికి నోచుకోలేదు! కాని నీకు మనఃప్రియమైన కార్యం నెరవేర్చానని మాత్రం కొంచెం సంతోషంగా ఉంది.

"నీ వీ శరీరం విడిచి స్వర్గలోకం చేరుకోగానే మాతండ్రి ద్రోణాచార్యులను కలుసుకొని, ఆయనతో ద్రోహి ధృష్టద్యుమ్నుని శిరస్సు తుత్తునియలుగా ఖండించివేశానని చెప్పి, నాకు బదులుగా ఆయనను గాఢంగా కౌగలించుకొని, సాష్టాంగ నమస్కారం చేయవలసిందని ప్రార్థిస్తున్నాను. రణరంగంలో మరణించిన మిగిలిన బంధుమిత్రుల నందరినీ వేరు వేరుగా అడిగినానని విన్నవించ వలసినది."

అని చెప్పి దుర్యోధనుని కర్ణాల కమృతసేచనం చేస్తూ పాండవ శిబిరంలో తాను సంహరించిన వీరులపేరులన్నీ వరసగా ఏకరువుపెట్టాడు.

ఇంకా తన సాహసకృత్యాలన్నీ అతివినయంగా ఆ చక్రవర్తి ముందు నివేదించాడు.

దుర్యోధనుని హృదయం ఆ భీషణప్రతీకారవృత్తాంతం వినగానే కొంచెం సేదదేరింది:

"గురుపుత్రా! నీవు చేసినట్లుగా భీష్మ ద్రోణ కర్ణ శల్యులలో ఎవరైనా చేయగలిగారా? నీవు నా కత్యంత ప్రియమయిన వార్త నివేదించి నీఋణం తీర్చుకొన్నావు. మిమ్మల్ని అందరినీ తిరిగీ స్వర్గంలో కలుసుకొంటాను."

అని వికసిత నేత్రాలతో ఆ ముగ్గురి ముఖాలూ చూస్తూ అలాగే ప్రాణత్యాగం చేశాడు.

తరవాత ఆ ముగ్గురూ దుర్యోధన చక్రవర్తి మృతి కెంతో విచారించారు. తిరిగీ తమ రథా లెక్కి ప్రయాణమయినారు.

అశ్వత్థామ తాను సంకల్పించిన భీషణప్రతీకారం నిర్విఘ్నంగా నెరవేరిందిగదా అని సంతృప్తిసూచకంగా ఒక దీర్ఘ నిశ్శ్వాసం విడిచిపెట్టాడు.

---